వై జంక్షన్.. టెన్షన్

- పహాడీషరీఫ్ ప్రధాన రహదారిపై వరుస ప్రమాదాలు
- సూచిక బోర్డులు కరువు
- రోడ్డుపైనే లారీల పార్కింగ్
- ఇబ్బందుల్లో వాహనదారులు


ప్రమాదాలకు నిలయంగా మారిన పహాడీషరీఫ్ వై జంక్షన్

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే ఎర్రకుంట నుంచి మొదలుకొని పహాడీషరీఫ్ బైపాస్ రోడ్డు వరకు గల ఈ రూట్‌లో ప్రమాదాలు నిత్య కృత్యమయ్యాయి. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి–765గా ఉన్న ఈ హైవేపై నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. ఫంక్షన్‌హాళ్లు, పెట్రోల్ పంప్‌లు, వ్యాపార సముదాయాలకు లబ్ధి చేకూర్చే విధంగా ఏర్పాటు చేసిన యూటర్న్‌ల కారణంగా ఏ గల్లీ నుంచి ఏ వాహనదారుడు రోడ్డుపైకి వస్తున్నాడో.. ఏ యూటర్న్ వద్ద అకస్మాత్తుగా మళ్లుతూ హైవేపై వేగంగా వెళ్తున్న వాహనాల మధ్యలోకి వచ్చి ప్రమాదాలకు కారణమవుతారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. సమస్య తీవ్రత ఈ స్థాయిలో ఉన్నా అటు రోడ్లు, భవనాల శాఖ.. ఇటు ట్రాఫిక్ పోలీసులు ఈ దారి వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తరచూ ప్రమాదాలు..

షాహిన్‌నగర్ నుంచి వచ్చే వాహనాలు అటు పహాడీషరీఫ్ పాత గ్రామం.. ఇటు తుక్కుగూడ రూట్లకు వెళ్లే పహాడీ వై జంక్షన్ వద్ద సూచిక బోర్డులు లేక పోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రూట్‌లో వెళ్లే పాత వాహనదారులను మినహాయిస్తే.. కొత్తగా వచ్చిన వారు ఈ జంక్షన్ వద్ద ఎటు వెళ్లాలో తెలియక అయోమయానికి గురై ప్రమాదాల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. గతేడాది మార్చిలో ఈ జంక్షన్ వద్దే కారు అదుపుతప్పి నాలుగు పల్టీలు కొట్టి కావలి రవీందర్ అనే వ్యక్తి మృతి చెందగా.. ముగ్గురు గాయాలపాలయ్యారు. ఈ రహదారిపై పెద్ద ఎత్తున ఉన్న ఫంక్షన్‌హాళ్లలో రాత్రి పూటే శుభకార్యాలు జరుగుతుండటం.. ఫంక్షన్‌హాళ్ల ఎదుటే యూటర్న్‌లు ఉండడంతో అర్ధరాత్రి వేళ రోడ్డు దాటే క్రమంలో కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

పట్టణాల్లోని పరిస్థితికి భిన్నంగా..

జాతీయ రహదారులపై ఉన్న పట్టణాలలో అటు పాదచారులకు, ఇటు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా సాఫీగా ప్రయాణం సాగేలా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం సహజం. కానీ ఈ మున్సిపాలిటీ పరిధిలోని రహదారికి ఇరువైపులా జనావాసాలు ఉన్నప్పటికీ రోడ్డు నిర్మాణంలో కనీస జాగ్రత్తలు తీసుకోలేదు. తుక్కుగూడ, కందుకూరు, కడ్తాల్, ఆమనగల్లులోని మాదిరిగా పట్టణాలలో తప్పనిసరిగా రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, వరద నీరు సాఫీగా వెళ్లేందుకు రోడ్డుకిరువైపులా డ్రైన్ బాక్స్‌లు నిర్మించాలి. జల్‌పల్లి పరిధి ప్రారంభమయ్యే ఫీలిదర్గా నుంచి ఎర్రకుంట పెట్రోల్ పంప్ వరకు కనీసం రోడ్డు డివైడర్ కూడా నిర్మించలేదు.

పార్కింగ్‌తో ఇబ్బందులు..

ఎర్రకుంట నుంచి పహాడీషరీఫ్ రహదారిలో లారీల పార్కింగ్‌తో కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎర్రకుంట, షాహిన్‌నగర్‌లలో గృహ నిర్మాణ సామగ్రిని సరఫరా చేసే లోకల్ లారీలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఇక ప్రమాదకరమైన వై జంక్షన్ వద్ద అక్కడే ఉన్న ఓ సిమెంట్ కంపెనీ, తదితర వ్యాపారాలకు సంబంధించిన యజమానులు వారి లారీలను యథేచ్ఛగా రోడ్డుపైనే పార్కు చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి


కైలాసగిరి వ్రత వేడుకల్లో పాల్గొన్న ఆర్యవైశ్యులు

హుడాకాంప్లెక్స్: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆర్‌కే పురం డివిజన్‌లోని గ్రీన్‌హిల్స్ ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు పీసర్ల లక్ష్మీ సుబ్రహ్మణ్యం అన్నారు. రథసప్తమిని పురస్కరించుకొని ఆదివారం గ్రీన్‌హిల్స్ కాలనీలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సామూహిక కైలాసగిరి వ్రత మహోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో 51 మంది పాల్గొని ప్రత్యేక పూజలు, నోములు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటామని, సంఘం నుంచి సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలను ఆదుకుంటామని చెప్పారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌టీలు శ్రీమన్నారాయణ, సరితాలోకేష్‌గుప్తా, రవీందర్, వేణుమాధవ్, చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్.. సూపర్


సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని మౌంట్ కార్మెల్ గ్లోబల్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం, డైరెక్టర్లు విచ్చేసి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ విజ్ఞాన ప్రదర్శనలో సైన్స్, సోషల్, గణిత, రోబోటిక్, స్పేస్ తదితర అంశాలకు సంబంధించిన ప్రాజెక్టులను విద్యార్థులు స్వయంగా తయారుచేసి ప్రదర్శించారు. ఈ సైన్స్ ఫెయిర్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు తిలకించారు. అందులో ముఖ్యంగా స్పేస్, రోబోటిక్ ప్రాజెక్టులు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుప్రభ హనీ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న నైతికతలు, సృజనాత్మకత, సరికొత్త ఆలోచనలు వెలికి తీసేందుకు ఈ సైన్స్ ఫెయిర్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనపరిచేలా ప్రాజెక్టుల తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జీఎస్‌ఐ, చాణక్యపురి, రాక్‌టౌన్, వాంబేకాలనీ, హనుమాన్‌నగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉండదని చెప్పారు. 11కేవీ ఇందూ అరణ్య హౌసింగ్, ఇందూ అరణ్య అపార్ట్‌మెంట్స్, హౌసింగ్ బోర్డ్, లక్ష్మీగణపతి, తట్టిఅన్నారం ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కందుకూరు: మండల పరిధిలోని గూడూరులో గల శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వా మి దేవస్థానం ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనె ల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం గోపూజ, తులసీ పూజలతో ప్రారంభించి రాత్రి ఎంఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణం కొనసాగుతుందన్నారు. మంగళవారం ధ్వజారోహణం, సంతానం కోసం పాయసం ప్రసాదం, గరుడ ప్రసాదం పంపిణీ, రాత్రి బాదంపల్లి సంతోష్‌కుమార్‌శర్మతో ప్రవచనాలు ఉంటాయన్నారు. బుధవారం రాత్రి ఆకెళ్ల విభీషణశర్మతో అష్టాక్షరి, గురువారం వసంతోత్సవం, గరుడ వాహన సేవ, శుక్రవారం ఉత్సవమూర్తికి అభిషేకం, చక్రస్నానం, హోమాలు, పూర్ణాహుతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

మండలాభివృద్ధికి కృషి

జెడ్పీటీసీ జంగారెడ్డి


కందుకూరులో మంజూరు పత్రాన్ని అందిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

కందుకూరు: మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రాచులూరులో సీసీ రహదారి నిర్మాణానికి గాను జెడ్పీ నిధుల నుంచి రూ.4 లక్షలు కేటాయించారు. దానికి సంబంధించిన మంజూరు పత్రాన్ని ఆదివారం ఆ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుయ్యని సామయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాధాన్యతా క్రమంలో గ్రామాలకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. అభివృద్ధి విషయంలో అందరూ కలిసిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డి, పార్టీ మండల బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కాసోజు ప్రశాంత్‌చారి, పి.తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న స్వామివారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గర్భాలయంలో ఉన్న స్వామివారికి పలు రకాల అభిషేకాల అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోనమోని శివశంకర్, పూజారులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయింపు హర్షణీయం

పహాడీషరీఫ్: ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించడం పట్ల జల్‌పల్లి గ్రామ ఎస్సీ కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం మంత్రి సబితారెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. బీఆర్‌ఎస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు యంజాల జనార్దన్, యువ నాయకుడు అర్జున్ ఆధ్వర్యంలో 250 మంది ఎస్సీ కులస్తులు మంత్రిని కలిసి ఇతర సమస్యలను కూడా విన్నవించారు. శ్మశానవాటికకు కూడా స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కోఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ భద్రమ్మ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెన్నం రాజేశ్, నాయకురాళ్లు పెంటమ్మ, కాంత పాల్గొన్నారు.

నిందితుడిని రిమాండ్‌కు తరలించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

బడంగ్‌పేట్: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గట్టు బాలకృష్ణను, కులం పేరుతో దూషించి చంపుతామని బెదిరించిన వ్యక్తిని 12 గంటల్లోగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని డీసీసీ అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. బడంగ్‌పేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. బడంగ్‌పేటలోని 119 సర్వే నంబర్‌లో గల ప్లాట్ల విషయంలో కులంపేరుతో నాయకుడు గట్టు బాలకృష్ణను దూషించడం సరికాదని అన్నారు. దళితులను చిన్నచూపు చూడటం దాడులకు పాల్పడి బెదిరించడం అధికార పార్టీ నాయకులకు మంచిది కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్‌నింగని జంగయ్య, నాయకులు గట్టు బాలకృష్ణ, రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, మహిళా అధ్యక్షురాలు అమృతనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో దళితులకు సముచిత స్థానం

మంత్రి సబితారెడ్డి


మంత్రి చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న మంద కుమార్

మహేశ్వరం: బీఆర్‌ఎస్ పార్టీ, నామినేటెడ్ పదవుల్లో దళితులకు సముచిత స్థానం కల్పించి గౌరవిస్తుందని మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గొల్లూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మంద కుమార్‌ని మహేశ్వరం నియోజకవర్గానికి బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ మంత్రి నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దళితుల పక్షపాతిగా నిరంతరం పని చేస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడ లేని విధంగా దళితులు వ్యాపార రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదిగేందుకు దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి ఒక్కో లబ్ధిదారుడిని రూ.10 లక్షలు అందిస్తున్నారన్నారు. దళితులకు మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనంతరం మంద కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో నియోజకవర్గ స్థాయి పార్టీ పదవీ బాధ్యతలు అప్పగించిన మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి అంజయ్య ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవవరం గౌడ్, పార్టీ సీనియర్ నాయకుడు రాయప్ప, మండల బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నందుపల్లి కుమార్, నాయకులు ఎల్లగని ప్రవీణ్ గౌడ్, వాసు గౌడ్, సుధాకర్, శ్రీధర్ గౌడ్, నరేశ్, జగదీశ్, టిఎస్.శ్రీనివాస్, కుమార్ పలువురు పాల్గొన్నారు.

మహేశ్వరం గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే..

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం గడ్డపై బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని మంత్రి సబితారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మండల పరిధిలోని గొల్లూరు గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు మంద నర్సింహ, దార కుమార్, మండల కృష్ణయ్య, దార గణపతి పలువురు క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంద కుమార్, మండల బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నందుపల్లి కుమార్, పార్టీ సీనియర్ నాయకులు ఎల్లని ప్రవీణ్ గౌడ్, మంద కుమార్, వాసుగౌడ్, సుధాకర్, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

భారీ విగ్రహం ఏర్పాటు చేయండి

మంత్రికి బాలాపూర్ బీఆర్‌ఎస్ నాయకుల వినతి

బడంగ్‌పేట్: బాలాపూర్‌లోని శివాజీ చౌక్‌లో ఉన్న శివాజీ విగ్రహం స్థానంలో 15 అడుగుల శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని ఆదివారం మంత్రి సబితారెడ్డికి బాలాపూర్ బీఆర్‌ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని ఆర్‌సీఐ రోడ్డు మధ్యలో ఉన్న చౌరస్తాలో ఛత్రపతి శివాజీ విగ్రహం చాలా చిన్నదిగా ఉందని గుర్తు చేశారు. ఆ విగ్రహం స్థానంలో అదే శివాజీ విగ్రహాన్ని 15 అడుగుల వరకు ఏర్పాటు చేస్తే ఆ ఏరియాలో ఐకాన్‌గా ఉంటుందని వారు పేర్కొన్నారు. అందుకు పూర్తి సహకారం అందిస్తామని మంత్రికి బాలాపూర్ స్థానికులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు గుండు రఘునందన్‌చారి, బాలాపూర్ బీఆర్‌ఎస్ నాయకులు కళ్లెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు తిమ్మని గిరీష్, నేతలు నితిన్‌రెడ్డి, గోపాల్‌నాయక్, యాదగిరి, అనిల్, పండరీనాథ్, శ్రీకాంత్, రంజిత్, కేదరినాథ్, నరేశ్ తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత


శివ భక్తులకు నగదు అందజేస్తున్న ఉపసర్పంచ్ రవినాయక్

మహేశ్వరం: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, హర్షగూడ గ్రామ ఉప సర్పంచ్ జె.రవినాయక్ అన్నారు. గ్రామానికి చెందిన శివమాల భక్తులకు వచ్చే నెల 11న నిర్వహించే శివ ఇరుముడి, మహాపడి పూజకు అయ్యే మొత్తం ఖర్చుకు సంబంధించిన రూ.లక్షా 40 వేల నగదును ఆదివారం భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నిర్మాణం చేస్తున్న ఆలయాలు, పూజల నిర్వహణకు తనవంతుగా ఆర్థికసాయం అందిస్తున్నానని తెలిపారు. ఆపదలో ఉన్నవారికి తనవంతుగా సాయం అందిస్తూ అండగా ఉంటానని తెలిపారు. అంతకు ముందు శివ ఇరుముడి, మహాపడి పూజకు సహకరించిన ఉప సర్పంచ్ రవినాయక్‌ను శివమాల ధరించిన భక్తులు ఘనంగా సన్మానించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కందుకూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్ సమావేశపు హాల్‌లో సోమవారం ఎంపీపీ మంద జ్యోతిపాండు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకట్రాములు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర ముఖ్య ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

వైభవంగా మైసమ్మ బోనాలు

పహాడీషరీఫ్: మామిడిపల్లి గ్రామ శివారులో గల ఈర్లగండి మైసమ్మ బోనాలు ఆదివారం కన్నుల పండువగా జరిగింది. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు, శివశక్తుల చిందులు, బ్యాండ్ మేళాల చప్పుళ్ల నడుమ మైసమ్మ ఆలయ ప్రాంగణాలు మారుమోగాయి. ముఖ్యంగా రాకేష్ మెట్ల బోనం అందరినీ అలరించింది. భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో మాజీ కార్పొరేటర్ ఈరంకి వేణుకుమార్ గౌడ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ గౌడ్, బాలాజీ ఆలయ మాజీ చైర్మన్ బండారి గోపాల్ యాదవ్, నాయకులు ఎడ్ల వాసుదేవారెడ్డి, కోట్ల రంగనాథ్, సుదర్శన్, సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2002–03 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం గ్రామ సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్ హాలులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వ పాఠశాలలో చదివిన జ్ఞాపకాలు, తరగతి గదిలో చేసిన చిలిపి చేష్టలను విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయులు గుర్తు చేసుకున్నారు. తమ బ్యాచ్ నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మచ్చేందర్ గౌడ్, ప్రకాశ్, రాఘవేందర్ గౌడ్, శ్రీశైలం, గోపాల్, శేఖర్, సుదర్శన్, రామకృష్ణ, రమేశ్, రవీందర్, రంజిత్, సావిత్రి, అరుణ, కవిత, విజయలక్ష్మి, మాధవిరెడ్డి, నవనీత్‌రెడ్డి, శ్వేతారెడ్డి, పలువురు పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల హెరిటేజ్ వాక్


చార్మినార్ వద్దకు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు

బడంగ్‌పేట్: విద్యార్థులకు పూర్వ, చారిత్రక కట్టడాలు, నిర్మాణాల గురించి అవగాహన కల్పించేందుకు బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో నాదర్‌గుల్‌ టు చార్మినార్ వరకు హెరిటేజ్ వాక్‌ను నిర్వహించారు. ఇందులో నాచారం, మహేంద్రహిల్స్, పల్లవి విద్యాసంస్థలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీపీఎస్ స్కూల్ చైర్మన్ మల్కా కొమరయ్య మాట్లాడుతూ.. ప్రతీ నగరానికి కొంత పూర్వ చరిత్ర ఉంటుందని అన్నారు. మన హైదరాబాద్ నగరం భిన్న సంస్కృతుల సమ్మేళనమని పేర్కొన్నారు. నగరంలోని చార్మినార్, మక్కామసీదు, గోల్కొండ కట్టడాలు ప్రపంచ వారసత్వ సంపదలో స్థానం సంపాదించి తెలంగాణ సంస్కృతి సంప్రదాయలకు పట్టం కట్టాయని గుర్తు చేశారు. అందుకే సుసంపన్నమైన వారసత్వ సంపద గురించి విద్యార్థులు తెలుసుకోవాలనే ఆకాంక్షతో 2017 నుంచి ఏటా హెరిటేజ్ వాక్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మజ్యోతి తురుగ, కార్యనిర్వాహణాధికారి యశస్వి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయండి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఇబ్రహీంపట్నం ఉంటుంది. నిత్యం వేలాది వాహనాలు ఈ రహదారి వెంట వెళ్తుంటాయి. ఈ నేపథ్యంలో డాగ్‌బంగ్లా ప్రధాన చౌరస్తాలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. పాత ఇబ్రహీంపట్నం గ్రామం లోపలి నుంచి, మంచాల రహదారి నుంచి వచ్చివెళ్లే వారికి ప్రధాన చౌరస్తా వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తున్నాయి. విద్యాసంస్థలకు నిలయంగా ఉన్న ఈ ప్రాంతంలో కళాశాల బస్సులు, ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులతో వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. పాదచారులు రోడ్డు దాటలంటే ఇబ్బందులు తప్పడంలేదు. డాగ్‌బంగ్లా వద్ద ఉన్న చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.